

విభారి

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఎడిటర్ : ఆవుల విజయభాస్కర్ రెడ్డి ప్రచురణ:-నంద్యాల, కర్నూల్. విజయవాడ, హైదరాబాద్, సంపుటి-08 సంచిక-132 పేజీలు- 8 వేల -3

శుక్రవారం 13-11-2026

పెట్టుబడులే లక్ష్యం..

అభివృద్ధే అజెండా

- వికేంద్రీకరణ ప్రణాళికలతో ప్రాంతాల వారీగా అభివృద్ధి
- పెట్టుబడుల సాధనలోనే కాదు... గ్రౌండింగ్‌లోనూ వేగమే మా లక్ష్యం
- భవిష్యత్ రంగాలకు ప్రాధాన్యమిస్తున్నాం
- ప్రధాని జన విశ్వాస్ పిలుపునకు అనుగుణంగా ఏపీలో పాలన
- నరేంద్ర మోదీ ద్వారానే వాటర్ గ్రిడ్ కల సాకారం



విశాఖపట్నం, నవంబర్ 12: వేగవంతమైన అభివృద్ధికి జాతీయ స్థాయిలో పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరారు. రెండు రోజుల 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. విశాఖపట్నంలో గురువారం ప్రారంభమైన సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరైన వివిధ దేశాల పారిశ్రామిక ప్రతినిధులు, రాయబారులు, ప్రభుత్వ ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. అలాగే రాష్ట్రంలో వివిధ రంగాల్లో జరుగుతోన్న అభివృద్ధిని పారిశ్రామికవేత్తలకు వివరించారు. పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి తెలియజేశారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాలకు చెందిన పెట్టుబడులకు అవకాశం ఉందో ప్రజెంట్ చేశారు. దీంతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచి జరిగిన ప్రగతిని సీఎం వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పెట్టుబడుల భద్రతకు సంబంధించి కీలక ప్రతిపాదనలు చేశారు. పెట్టుబడులు పెట్టే పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం, ఉత్సాహం కల్పించేందుకు పారిశ్రామిక రాయితీలకు సంబంధించి ఎస్క్రో ఖాతాను తెరుస్తున్నామని చెప్పారు. దీంతో పాటు పెట్టుబడుల రక్షణ చట్టం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో పెట్టుబడుల చట్టం చేసి కేంద్రానికి పంపుతామని... దాన్ని కేంద్రం ఆమోదించాలని కోరారు. జాతీయ స్థాయిలో కూడా పెట్టుబడుల భద్రతా చట్టాన్ని చేస్తే భారతదేశ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాల మధ్య వైరుధ్యాలకు పెట్టుబడిదారులు బలికాకూడదని, వచ్చే పెట్టుబడులకు శాశ్వత భరోసా కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ అవసరమన్నారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వంపై నమ్మకం, ఇచ్చిన హామీల అమలుపై భరోసా కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

మిగతా 2లో



హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ

విస్తరణ..

- హైదరాబాద్‌లో మార్స్ జీసీసీ కేంద్రం ప్రారంభం
- మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- జెన్‌పాక్ట్ భాగస్వామ్యంతో సరికొత్త కేంద్రం ఏర్పాటు
- త్వరలోనే వెయ్యి మంది నిపుణుల స్థాయికి విస్తరణ
- ఏఐ క్లౌడ్ ఇంజనీరింగ్‌పై ప్రధాన దృష్టి

హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న క్రమంలో మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఇక్కడ తన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రఖ్యాత సంస్థ 'మార్స్' (మీఠీం),

మిగతాది 2లో

లెజెండ్ స్థానంలో మరో లెజెండ్ రావాలి

- ఎన్విడియా సీఈవో బాధ్యతలు టిమ్ కుక్ చేపట్టాలన్న ట్రంప్
- జెన్సన్ హువాంగ్ స్థానంలో కుక్ మాత్రమే సరైన ప్రత్యామ్నాయమని వ్యాఖ్య
- వివాదాల నేపథ్యంలో ఎన్విడియా సీఈవో పదవికి జెన్సన్ హువాంగ్ రాజీనామా
- ప్రస్తుతం ఎన్విడియా తాత్కాలిక సీఈవోగా వ్యవహరిస్తున్న కొలెట్ క్రెస్
- యాపిల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతున్న టిమ్ కుక్



ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చిప్ తయారీ దిగ్గజ సంస్థ ఎన్విడియా (చీజఅఒఖు) నూతన సీఈవోగా యాపిల్ మాజీ చీఫ్ టిమ్ కుక్ బాధ్యతలు చేపట్టాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. ఎన్విడియా వ్యవస్థాపకుడు,

ఏపీ లిక్కర్

కేసులో కీలక మలుపు..

- ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం
- నిందితులు రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డి బెయిల్ రద్దుకు పిటిషన్
- తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- సాక్షులను ప్రభావితం చేస్తారనే ఆందోళన వ్యక్తం చేసిన ఈడీ



2

శ్రీకాళహస్తి ఆలయంలోని అన్నప్రసాద పోటులో

అగ్నిప్రమాదం...

- నెయ్యి ఒలికిపడటం వల్ల చెలరేగిన మంటలు
- భయంతో పరుగులు తీసిన భక్తులు
- సకాలంలో స్పందించి మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది

2లో

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో కాసేపటి క్రితం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆలయ ప్రాంగణంలోని దక్షిణ గోపురం సమీపంలో ఉన్న అన్నప్రసాద పోటులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్వామివారికి లడ్డు, వడ,

4 కార్పొరేషన్లు..

19 మున్సిపాలిటీలకు ఎన్నికలు

ఏపీలో 23 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలకు నోటిఫికేషన్

- నవంబర్ 26న పోలింగ్.. 30న ఫలితాలు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్



ఆంధ్రప్రదేశ్ లో పెండింగ్‌లో ఉన్న కొన్ని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నగారా మోగించింది. రాష్ట్రంలోని 4 నగరపాలక సంస్థలు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈరోజు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నోటిఫికేషన్ వెలువడటంతో సంబంధిత పురపాలక ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) తక్షణమే అమల్లోకి వచ్చింది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... నవంబర్ 14 నుంచి 16 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నవంబర్ 17న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అభ్యర్థుల ఉపసంహరణకు నవంబర్ 19 వరకు గడువు ఇచ్చారు.

మిగతాది 2లో

మరో 79 డయాలసిస్

కేంద్రాలకు వేగం

- నిమ్స్‌పై ఒత్తిడి తగ్గించేందుకు సనత్‌నగర్ టిమ్స్ వినియోగం
- మరో 79 డయాలసిస్ కేంద్రాల పనులు త్వరగా పూర్తి చేయాలి
- మూడేళ్లలో 13,401 వైద్య సిబ్బంది నియామకాలు పూర్తి
- మరో 5,640 వైద్య సిబ్బంది నియామక ప్రక్రియ కొనసాగుతోంది



హైదరాబాద్, నవంబర్ 12: వచ్చే ఏడాది జూన్ 2వ తేదీ నాటికి అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మంత్రి దామోదర రాజనర్సింహాతో

మిగతాది 2లో

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

- క్యూర్ పరిధిలో మరో మూడు వీడతల్లో ఇళ్ల మంజూరు
- 23 నియోజకవర్గాల్లో పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు
- కుల, మత, పార్టీల భేదాలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక
- లబ్ధిదారుల ఆనందబాష్పాలే ప్రజా ప్రభుత్వానికి ఆశీస్సులు



2

2047 డెడ్‌లైన్ కాదు..

నిరంతర లక్ష్యం

- వికసిత భారత్ లక్ష్యం అందుబాటులోనే ఉందన్న ప్రధాని మోదీ
- 2047 అనేది డెడ్‌లైన్ కాదు, నిరంతర లక్ష్య సాధన మార్గమని వెల్లడి
- దేశ విజయాలను ప్రపంచానికి చాటిచెప్పాలని మీడియాకు పిలుపు



వికసిత భారత్' లక్ష్యం మనకు పూర్తిగా అందుబాటులోనే ఉందని, ఇటీవలి సంవత్సరాలలో దేశం సాధించిన విజయాలే దీనికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. 2047వ సంవత్సరాన్ని మనం వేచి చూడాల్సిన డెడ్‌లైన్‌గా కాకుండా, ఆ లక్ష్యం దిశగా నిరంతరం పురోగతి సాధించాల్సిన మార్గంగా చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'దీపావళి మిలన్ సమారోహ్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు.

మిగతాది 2లో

హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ..



సంస్థ 'మార్స్' (మ్ఘీతీం), ఐటీ సేవల సంస్థ 'జెన్‌పాక్ట్' (+వఅజూఘష్) భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సరికొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను గురువారం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు. ఈ సరికొత్త కేంద్రం ప్రస్తుతం 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ప్రారంభ దశలో భాగంగా 400 నుంచి 525 మంది జెన్‌పాక్ట్ ఉద్యోగులతో కార్యకలాపాలు సాగనున్నాయి. భవిష్యత్తులో ఈ కేంద్రాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే కాలంలో మరో 70,000 చదరపు అడుగుల స్థలాన్ని జోడించి, ఉద్యోగుల సంఖ్యను దాదాపు 1,000 మంది మార్స్ అసోసియేట్స్ స్థాయికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కేంద్రం ప్రధానంగా అత్యాధునిక సాంకేతిక సేవలపై దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), సాఫ్ట్‌వేర్ అండ్ క్లౌడ్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, డేటా అండ్ అనలిటిక్స్ వంటి కీలక టెక్నాలజీ విభాగాల్లో హైదరాబాద్ కేంద్రం నుంచి గ్లోబల్ సేవలు అందనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలను అందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. స్నికర్స్, ఎం అండ్ ఎమ్స్, పెడిగ్రీ, రాయల్ కెనైన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ద్వారా మార్స్ సంస్థ ప్రజలకు సుపరిచితమని పేర్కొన్నారు. అంతటి గుర్తింపు ఉన్న సంస్థ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నగరాన్ని ఎంచుకోవడం హర్షణీయమని తెలిపారు. తెలంగాణలో ఉన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం, ప్రతిభావంతులైన మానవ వనరులు ఐటీ రంగ విస్తరణకు చక్కటి అవకాశాలను కల్పిస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్స్ మరియు జెన్‌పాక్ట్ బృందాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి భూమిపూజ



ఈ రోజు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మరియు రాజేంద్రనగర్ మండలం మైలార్‌దేవపల్లిలో సహచర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ణబఎఎఅశ్రీశ్రీఘ ూతీఅఎష్ఘుతీ ఝీఎబ గారు , ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖా ఉన్నతాధికారులు, లబ్దిదారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. అదే వేదికగా ఆన్లైన్ లో ఈ – లాటరీ ద్వారా లబ్ధిదారులకు ఏబ్లాక్ లో ఏప్లాట్ వచ్చిందో తెలియజేసీ, ఇళ్ల పట్టాల మంజూరు పత్రాలను అందించడం జరిగింది.

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు చేసి నెత్తిన పెట్టి పోయినా, ఎల్ నినో వంటి ప్రకృతి విపత్తులు వచ్చినా ఈ పథకం ఆగదు.

నిరుపేదల ఆత్మగౌరవమే ఆలంబనగా క్యూర్ పరిధిలోని కోట్లాది రూపాయల విలువచేసే ప్రాంతాల్లో శంకుస్థాపనలు పూర్తిచేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను వచ్చే దీపావళికల్లా పూర్తి చేస్తాం. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో లబ్దిదారులు ఆ ఇళ్లలో దీపావళి జరుపుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. పేదల జీవితాశయమైన సొంత ఇంటి కలను ప్రభుత్వం నెరవేరుస్తుంది. క్యూర్ పరిధిలో మరో మూడు విడతలు కూడా ఇళ్లు మంజూరు చేస్తాం.క్యూర్ పరిధిలోని 23 నియోజకవర్గాలలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా, కులమతాలు, పార్టీల బేధాలు లేకుండా కేటాయింపు జరుగుతోంది. ఇళ్లు పొందిన లబ్దిదారులు కంట ఆనందబాష్పాలు చూస్తుంటే ఈ ప్రభుత్వానికి, తమకు ఇంతకంటే ఇంకేం కావాలనిపిస్తుంది. వారి స్పందన చూస్తే కళు చెమరుస్తున్నాయి. వారి ఆనందభాష్పాలే ప్రజాప్రభుత్వానికి ఆశీస్సులు.

మరో 79 డయాలసిస్ కేంద్రాలకు వేగం

ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి వైద్యారోగ్య శాఖకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలను ఏకకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

30 వేల నుంచి 38 వేలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకలు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచామని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్సల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు.

టిమ్స్‌లలో ఏకీకృత నియామక విధానం

సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లలో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలను ఏకీకృత విధానంలో చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్‌ల మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా విధానం రూపొందించాలని సూచించారు.

ఆసుపత్రుల నిర్వహణ, పారిశుద్ధ్య సిబ్బంది నియామకాలను ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సూచించారు. టిమ్స్‌ల పర్యవేక్షణకు గ్రూప్–1 అధికారులను నియమిస్తామని తెలిపారు. నిర్వహణ, పారిశుద్ధ్య సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమించాలని సూచించారు. వైద్యేతర నిర్వహణ బాధ్యతలకు ప్రత్యేక సిబ్బంది ఉంటే వైద్యులు పూర్తిగా వైద్య సేవలపైనే దృష్టి సారించగలరని సీఎం పేర్కొన్నారు.

నిమ్స్‌పై ఒత్తిడి తగ్గించేందుకు సనత్‌నగర్ టిమ్స్ వినియోగం

నిమ్స్‌లో శస్త్రచికిత్సలకు ఎక్కువ సమయం పడుతున్న నేపథ్యంలో సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిమ్స్‌లో పడకలు అందుబాటులో లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యం అవుతున్నా సనత్‌నగర్ టిమ్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ అంశంపై వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. టిమ్స్‌లలో వైద్యుల నియామకాలు పూర్తయ్యే వరకు అవసరమైతే బయటి వైద్యులను నియమించుకోవాలని, ఇందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

మరో 79 డయాలసిస్ కేంద్రాలు త్వరగా అందుబాటులోకి

అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా 16 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్న మరో 79 డయాలసిస్ కేంద్రాల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

టిమ్స్‌లతో పాటు వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలల నిర్మాణ పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియను కూడా ఏకకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరును కృత్రిమ మేధ పర్యవేక్షణతో కూడిన బయోమెట్రిక్ విధానం ద్వారా నమోదు చేయాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన రోగుల సంఖ్య

ప్రభుత్వ ఆసుపత్రుల్లో బహిర్గత రోగుల సంఖ్య 7 కోట్ల నుంచి 9 కోట్లకు పెరగడం, ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్న వారి సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం నిధులు కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.

మూడేళ్లలో 13,401 వైద్య సిబ్బంది నియామకాలు

గత మూడేళ్లలో వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని సీఎం తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

2047 డెడ్‌లైన్ కాదు.. నిరంతర లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "భారత్ నేడు సాధిస్తున్న విజయాల దృష్ట్యా, వికసిత భారత్ లక్ష్యం మనకు అందనంత దూరంలో లేదు" అని అన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని ఆయన ఉదహరించారు. "ఒకప్పుడు ఊహించడానికే కష్టంగా ఉన్న మైలురాళ్లను భారత్ ఇప్పుడు అందుకుంటోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను దింపి భారత్ చరిత్ర సృష్టిస్తుందని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా ఎదుగుతుందని ఎవరైనా ఊహించారా?

గత 12 ఏళ్లలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థను నిర్మించుకున్నాం. మన యూపీఐ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా నిలిచింది. ఇవన్నీ సాధించగలిగినప్పుడు, వికసిత భారత్ కలను కూడా మనం కచ్చితంగా సాకారం చేసుకోగలం. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి నిర్మిస్తారని ఎవరు భావించారు?" అని ప్రధాని పేర్కొన్నారు.

గత 12 ఏళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వచ్చిన మార్పును ఆయన ఉదహరించారు. "మిత్రులారా.. 12 ఏళ్ల క్రితం నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కూడా పెద్ద విజయంగా భావించేవారని గుర్తుంచుకోండి. నేను ముఖ్యమంత్రిగా ఉన్న తొలి రోజుల్లో గ్రామాలకు వెళితే, కరవు పనుల్లో భాగంగా మా ఊరికి కనీసం ఒక రోడ్డు వేయించండి సారూ అని వినతిపత్రాలు ఇచ్చేవారు" అని ఆయన గుర్తుచేసుకున్నారు.

పేదరిక నిర్మూలన విషయంలో ప్రభుత్వాల వైఖరిలో వచ్చిన మార్పును కూడా మోదీ వివరించారు. "ఒకప్పుడు ప్రతి నాయకుడు ఎర్రకోట నుంచి పేదరికాన్ని నిర్మూలిస్తామని నినదించేవారు. అది ఒక మంత్రంలా ఉండేది. ప్రతి ఎన్నికలోనూ పేదరికాన్ని పోగొడతామని హామీలు ఇచ్చేవారు. కానీ నేడు, పేదలు స్వయంగా పేదరికం నుంచి బయటపడుతున్నారు. పేదరికం తగ్గుముఖం పట్టడం మనం చూస్తున్నాం" అని తెలిపారు.

వికసిత భారత్ లక్ష్యంపై మాట్లాడుతూ, ప్రధాని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉదాహరణగా చూపారు. "సంపూర్ణ స్వాతంత్ర్యం అనేది ఒకటి రెండు రోజుల్లో సాధ్యపడలేదు. క్రమంగా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగింది. అదే విశ్వాసం ఇప్పుడు దేశ ప్రజల్లో కనిపిస్తోందని, అదే మనల్ని వికసిత భారత్ లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని పేర్కొన్నారు.

భారతదేశ విజయగాథలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. "21వ శతాబ్దంలో కమ్యూనికేషన్ అనేది అతిపెద్ద బలం. మనకు యువ జనాభా, ప్రతిభ, టెక్నాలజీ, చౌకైన డేటా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రపంచానికి చెప్పడానికి మన దగ్గర ఒక అద్భుతమైన కథ 'ఇండియా స్టోరీ' ఉంది.

నా 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ ప్రజల విజయాలకు నేను నిరంతరం ఒక వేదిక కల్పిస్తున్నాను. భారత మీడియా కూడా దేశ విజయాలను చాటిచెప్పే కథనాలపై పనిచేసి, వాటిని ముందుకు తీసుకెళ్లాలి. ఇది దేశానికి చేసే గొప్ప సేవ అవుతుంది" అని ప్రధాని కోరారు. అనంతరం దీపావళి, నవరాత్రి, ఛఠ్ పూజ పండుగల సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు..

(మొదటి పేజి తరువాయి)

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ కేసు దర్యాప్తు ముమ్మరమవుతున్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డిలకు మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న నిందితులు కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని ఈడీ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధానంగా సాక్షులను ప్రలోభపెట్టడం లేదా బెదిరించడం ద్వారా విచారణకు ఆటంకం కలిగించే ప్రమాదం ఉందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. నిందితులు బయట ఉండటం దర్యాప్తు సజావుగా సాగడానికి ఆటంకంగా మారుతుందని ఈడీ పేర్కొంది. ఏపీ లిక్కర్ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ ఇప్పటికే లోతైన విచారణ జరుపుతోంది. ఈ క్రమంలో నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈడీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు త్వరలోనే విచారణ చేపట్టనుంది.

శ్రీకాళహస్తి ఆలయంలోని అన్నప్రసాద పోటులో అగ్నిప్రమాదం..

(మొదటి పేజి తరువాయి)

ఆలయ ప్రాంగణంలోని దక్షిణ గోపురం సమీపంలో ఉన్న అన్నప్రసాద పోటులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్వామివారికి లడ్డు, వడ, అన్నప్రసాదాలు తయారు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో... పోటు నుంచి భారీగా అగ్నికీలలు, దట్టమైన పొగ ఎగసిపడ్డాయి. నెయ్యి ఒలికిపడటం వల్ల మంటలు చెలరేగినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పోటులో ప్రసాదాలు తయారు చేస్తున్న సిబ్బందితో పాటు పరిసరాల్లో ఉన్న భక్తులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు. సమాచారం అందిన వెంటనే ఆలయ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదం మరింత విస్తరించకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా సమీపంలోని మండపాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు కాకపోవడంతో ఆలయ వర్గాలు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఆలయ ఈవో, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం కారణంగా ప్రసాదాల తయారీని తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

4 కార్పొరేషన్లు.. 19 మున్సిపాలిటీలకు ఎన్నికలు

(మొదటి పేజి తరువాయి)



నవంబర్ 17న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అభ్యర్థుల ఉపసంహరణకు నవంబర్ 19 వరకు గడువు ఇచ్చారు. అనంతరం నవంబర్ 26న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. గతంలో న్యాయపరమైన వివాదాలు, వార్డుల పునర్విభజన కారణాలతో ఈ 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిలిచిపోయాయి. ఇటీవల హైకోర్టులో న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడం, రిజర్వేషన్ల ప్రక్రియ కూడా కొలిక్కి రావడంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఈ ఎన్నికల ద్వారా శ్రీకాకుళం, కాకినాడ, రాజమండ్రి, మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్లలోని 260 డివిజన్లతో పాటు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలోని 749 వార్డులకు ప్రజాప్రతినిధులను ఎన్నుకోనున్నారు.

లెజెండ్ స్థానంలో మరో లెజెండ్ రావాలి

(మొదటి పేజి తరువాయి)

బాధ్యతలు చేపట్టాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. ఎన్విడియా వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్సన్ హువాంగ్ తన పదవికి ఆకస్మికంగా రాజీనామా చేసిన నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ టెక్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తన అధికారిక సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. జెన్సన్ హువాంగ్ ఎన్విడియాను అగ్రగామిగా తీర్చిదిద్దిన తీరును ప్రశంసించిన ట్రంప్.. "ఒక లెజెండ్ స్థానాన్ని మరో లెజెండ్ మాత్రమే భర్తీ చేయగలడు" అని పేర్కొన్నారు. ఆ స్థానానికి టిమ్ కుక్ సరైన వ్యక్తి అని ట్రంప్ అభిప్రాయపడ్డారు. వివాహేతర సంబంధాల ఆరోపణలు రావడంతో జెన్సన్ హువాంగ్ నేడు తక్షణమే అమల్లోకి వచ్చేలా ఎన్విడియా ప్రెసిడెంట్, సీఈవో అలాగే డైరెక్టర్ల బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేశారు. చైనా ఇంటెలిజెన్స్‌తో సంబంధాలు ఉన్నట్లు అమెరికా నిఘా వర్గాలు అనుమానిస్తున్న మెగాస్పీడ్ మాజీ ఎగ్జిక్యూటివ్, చైనా వ్యాపారవేత్త ఆలిస్ హువాంగ్ (హువాంగ్ లే)తో వివాహేతర సంబంధం నెరిపినట్లు వచ్చిన ఆరోపణలు వివాదాస్పదమయ్యాయి. దీనిపై ఎన్విడియా స్వతంత్ర దర్యాప్తు ప్రారంభించగా, హువాంగ్ తన తప్పును అంగీకరిస్తూ క్షమాపణలు చెప్పారు. అయితే సంస్థ రహస్యాలు గానీ, అమెరికా జాతీయ భద్రత గానీ ప్రమాదంలో పడలేదని ఎన్విడియా స్పష్టం చేసింది. ఆమె గూఢచారి అనే విషయం తనకు తెలియదన్న హువాంగ్ వివరణను తాను నమ్ముతున్నట్లు ట్రంప్ గతంలోనే పేర్కొన్నారు. హువాంగ్ రాజీనామా అనంతరం ఎన్విడియా యాజమాన్యం తదుపరి చర్యలను వేగవంతం చేసింది. సంస్థలో సుదీర్ఘకాలంగా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (జఖీూ)గా సేవలందిస్తున్న కొలెట్ క్రెస్‌ను తాత్కాలిక సీఈవోగా నియమించింది. శాశ్వత సీఈవో ఎంపిక కోసం సంస్థ అంతర్గతంగా ఉన్నవారితో పాటు బయటి వ్యక్తులను కూడా పరిశీలిస్తోంది. మరోవైపు టిమ్ కుక్ సుమారు 15 ఏళ్ల పాటు యాపిల్ సీఈవోగా పనిచేసి ఈ ఏడాది సెప్టెంబర్ లో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అనంతరం జాన్ టెర్నస్ యాపిల్ సీఈవోగా బాధ్యతలు స్వీకరించగా, కుక్ ప్రస్తుతం కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

పెట్టుబడులే లక్ష్యం.. అభివృద్ధే అజెండా

ఈ సదస్సులో వచ్చే పెట్టుబడులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టువుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతా ద్వారా అందించడం వల్ల వాటి చెల్లింపుల్లో పారదర్శకత, విశ్వసనీయత పెరుగుతాయని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా కీలకంగా మారనున్న సాంకేతిక, పారిశ్రామిక రంగాలను ప్రాధాన్యంగా తీసుకున్నామని చంద్రబాబు వివరించారు. రేర్ ఎర్త్ మాగ్నెట్స్, స్టీల్ ఉత్పత్తి, సోలార్ వేఫర్లు, సౌర విద్యుత్తు, బ్యాటరీ ఎనర్జీ రంగాల్లో పెద్దఎత్తున అవకాశాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. క్రిటికల్ మినరల్ మిషన్, స్టీల్ పాలసీ, సోలార్ మిషన్, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత, అంతరిక్ష రంగానికి స్పేస్ విజన్, సెమీకండక్టర్ మిషన్, లాజిస్టిక్స్ పాలసీ, క్వాంటం టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, మారిటైమ్ రంగాల అభివృద్ధికి కార్యాచరణ చేపట్టామని చెప్పారు. అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయడంతో పాటు, క్వాంటం పరికరాలను మేడ్ ఇన్ అమరావతి బ్రాండుతో తయారు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పౌర అవసరాలు, రక్షణ రంగ అవసరాలకు ఉపయోగపడే డ్రోన్ల తయారీ కోసం ప్రత్యేకంగా డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే మారుమూల ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఔషధాలను రవాణా చేస్తున్నామని వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో 25 సెక్టోరల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ చిప్ డిజైన్ కేంద్రంగా అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలను ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

మహేంద్రవాడ కూటమి సర్పంచ్ అభ్యర్థిగా నారాయణరెడ్డి



అనపర్తి, నవంబర్ 12 విభారె న్యూస్:- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బలపరిచిన మహేంద్రవాడ గ్రామ కూటమి సర్పంచ్ అభ్యర్థి వెలగల నారాయణరెడ్డికి పలువురు నాయకులు, గ్రామస్తులు గురువారం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో కూటమి ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న ఆయనకు గ్రామ ప్రజలు, రైతులు, యువత నుంచి విశేష మద్దతు లభిస్తోందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. గ్రామంలో దీర్ఘకాలికంగా నెలకొన్న మౌలిక సదుపాయాల లేమి, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా నారాయణరెడ్డి పని చేస్తారని గ్రామస్తులు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆశీస్సులతో, కూటమి పక్షాల నాయకుల సమన్వయంతో సర్పంచ్ ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. అందరి సహకారంతో మహేంద్రవాడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు

కూటమి సర్పంచ్ అభ్యర్థి సురేఖ విస్తృత ప్రచారం

జగ్గంపేట, నవంబర్ 12 విభారె న్యూస్:- కాకినాడ జిల్లా జగ్గంపేటలో కూటమి పార్టీలు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పాండ్రంగి సురేఖ రాంబాబు ఎన్నికల ప్రచారాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా గ్రామ దేవత రావులమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం జగ్గంపేట జడ్పీటీసీగా విజయం సాధించిన జీను మణి బాబుతో పాటు ఐదుగురు ఎంపీటీసీలను ఘనంగా సత్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో తనను ఆదరించి సర్పంచ్‌గా గెలిపిస్తే జగ్గంపేట అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరించి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో తన విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో జగ్గంపేటను సుందర గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, ఎంపీటీసీలు రీస్ రమణబాబు, నేదూరి గణేష్, కోడూరి సత్యనారాయణ, కింగం బాబురావు, గుండా శ్రీను, రాయి సాయి, వేములకొండ జోగారావు, పీల మహేష్, నాండ్ల చిరంజీవి, మారిశెట్టి గంగ, కింగం రామకృష్ణ, గెద్దాడ సత్యవేణి, మారిశెట్టి రాధా, దుర్గపు ప్రకాష్, తోలేటి సూర్యనారాయణ, సాంబతుల చంద్రశేఖర్, ముత్యాల సత్యనారాయణ, పలివెల యేసు రాజు, తుమ్మల కిషోర్, బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే జ్యోతులను కలిసిన ఎంపీటీసీ నూకరాజు

జగ్గంపేట, నవంబర్ 12విభారె న్యూస్:- శాసనసభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూను గండేపల్లి మండలం కే.గోపాలపురం ఎంపీటీసీ సభ్యులు వేమగిరి నూకరాజు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కే.గోపాలపురం ఎంపీటీసీగా అఖండ మెజార్టీతో విజయం సాధించిన అనంతరం ఆయన ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేమగిరి నూకరాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో, స్వర్గీయ అవసరాల బాలసుబ్రహ్మణ్యం కుమారుడు శ్రీనివాస్ నాయకత్వంలో గ్రామంలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా తాను ఘన విజయం సాధించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సంపూర్ణ సహకారంతో కే.గోపాలపురం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కే.గోపాలపురం టీడీపీ, జనసేన కూటమి పక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కౌన్సిలర్ సుహైల్ రానా చొరవ!

విభారె న్యూస్:- నవంబరు 12, నంద్యాల జిల్లా. నంద్యాల పట్టణం 44వ వార్డులో చాలా కాలంగా మూసుకుపోయి ఇబ్బందులకు గురిచేస్తున్న డ్రైనేజీ సమస్యను స్థానిక ప్రజలు కౌన్సిలర్ సుహైల్ రానా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కౌన్సిలర్ సుహైల్ రానా సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి, శానిటేషన్ సిబ్బందిని రంగంలోకి దించి మూసుకుపోయిన డ్రైనేజీని శుభ్రం చేయించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యతగా ముందుకు సాగుతానని కౌన్సిలర్ సుహైల్ రానా తెలిపారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్

విభారె న్యూస్:-నవంబరు 12,నంద్యాల జిల్లా.అమరావతి: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా హాజరయ్యారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, అవసరమైన ఏర్పాట్లపై ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు.

ధరల నియంత్రణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

-బియ్యం విక్రయాల్లో అధిక ధరలకు అడ్డుకట్ట వేయాలి -- జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్



విభారె న్యూస్:-నవంబరు 12, నంద్యాల జిల్లా. నంద్యాల: బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు అధికంగా పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య, పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయాలు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులను ఆదేశించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరలను వివరించారు. నిర్ణీత ధరలకు మించి విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

బియ్యం రకాల వారీగా నిర్ణయించిన ధరలు:

– దూ సోనా, సాంబా (కర్నూల్ సోనా), ఖచీవీ రకాలు -- కిలో రూ. 66 – ఎమీ, =చీ= రకాలు -- కిలో రూ. 76 – స్వర్ణ మసూరి రకం -- కిలో రూ. 47 – జై శ్రీరామ్ (నంద్యాల సోనా) రకం – – కిలో రూ. 82 ప్రతి బియ్యం దుకాణం, రైస్ మిల్లు వద్ద వివిధ రకాల బియ్యం ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరగాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బియ్యం విక్రయాల్లో అక్రమాలు, అధిక ధరల వసూళ్లు, తూకాలు, కొలతల్లో మోసాలు జరగకుండా పౌర సరఫరాల శాఖ, తూనికలు--కొలతల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జీఎస్టీ అధికారులు సమన్వయంతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో లిమార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్‌లి ద్వారా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టిందని జాయింట్ కలెక్టర్ వెల్లడించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉన్నత విద్యలో నూతన విప్లవం

● శ్రీ రామకృష్ణ కళాశాలలో ఏ ఐ యూ - ఏ.ఏ.డి.సి కేంద్రం ప్రారంభం. ● అంతర్జాతీయ ప్రమాణాలతో అధ్యాపకులకు శిక్షణ . ● విద్యార్థుల్లో స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం.

నంద్యాల నవంబర్ 12 విభారె న్యూస్:-ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోందని, ఉన్నత విద్యలో బోధన, అభ్యసనం, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాలను ఏ. ఐ సరికొత్త దిశలో నడిపిస్తోందని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.





శ్రీ రామకృష్ణ డిగ్రీ (అటానమస్) కళాశాల, నంద్యాలలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సహకారంతో ఏర్పాటు చేసినఏ. ఐ.యూ ఐ.ఏ.డి.సి. -- ఎస్.అర్.కే.డి.సి కేంద్రం ప్రారంభోత్సవం మరియు ఐదు రోజుల ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ అప్లికేషన్స్,అప్పోర్టునిటీస్ మరియు రెస్పాన్సిబుల్ అడాప్షన్

అనే ప్రధాన అంశంపై నవంబర్ 12 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులకు కృత్రిమ మేధస్సు వినియోగం, ఆధునిక డిజిటల్ బోధనా పద్ధతులు, పరిశోధనలో ఏ. ఐ అనువర్తనాలు, బాధ్యతాయుతమైన సాంకేతిక వినియోగంపై అవగాహన కల్పించనున్నారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యాసంస్థలు కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాల్సిన అవసరం ఉందని, ఏ. ఐ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకుంటే అధ్యాపకుల బోధనా సామర్థ్యం పెరగడంతో పాటు విద్యార్థుల సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.ఏ. ఐ .యూ-- ఏ.ఏ.డి.సి కేంద్రం కళాశాల అకడమిక్ మరియు అడ్మినిస్ట్రేటివ్ అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కళాశాల ప్రిన్సిపాల్ కె.బి.వి. సుబ్బయ్య మాట్లాడుతూ, నూతన విద్యా విధానం (ఎన్.ఈ.పి--2020) లక్ష్యాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యా వ్యవస్థలో భాగం చేయడం నేటి అవసరమని పేర్కొన్నారు. అధ్యాపకులు నిరంతరం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ, ఏ. ఐ ఆధారిత విద్యా విధానాలు భవిష్యత్తు విద్యారంగాన్ని పూర్తిగా ప్రభావితం చేయనున్నాయని, ఇలాంటి జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమాలు అధ్యాపకులకు నూతన అవకాశాలను అందిస్తాయని తెలిపారు.

డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఏ.ఎస్. ప్రగతి రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, నూతన ఆలోచనలు, సృజనాత్మకత, ఆవిష్కరణలతో స్వయం ఉపాధి కల్పించుకునే స్థాయికి ఎదగాలని, స్టార్టప్ సంస్కృతిని విద్యార్థుల్లో ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

మొదటి సెషన్ -- స్టార్టప్‌లు, ఆవిష్కరణలపై ప్రత్యేక అవగాహన

ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైన మొదటి సెషన్‌లో ముఖ్య వక్త ఏ. చంద్రశేఖర్ స్టార్టప్‌లు, నూతన వ్యాపార ఆలోచనలు, ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలు మరియు అవకాశాలపై విలువైన అవగాహన కల్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగార్థులుగా మాత్రమే కాకుండా ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, తమ ఆలోచనలను ఆచరణలో పెట్టే ధైర్యం, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వివరించారు.

ఈ కార్యక్రమానికి ఎఫ్.డి.పి కోఆర్డినేటర్ డాక్టర్ డి. పుల్లయ్య, డాక్టర్ యు.వి.ఎస్. కుమార్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్రం ప్రారంభం, నిర్వహణ ద్వారా శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ఉన్నత విద్యలో నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణలు మరియు నైపుణ్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యతనిస్తూ నూతన విద్యా ప్రమాణాల దిశగా ముందడుగు వేస్తోంది. ఈ కార్యక్రమం అధ్యాపకులకు మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాల విద్యార్థులకు కూడా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నూతన అవకాశాలకు మార్గదర్శకంగా నిలవనుంది.

పాడుబడిన బావికి పునర్జీవం..

సొంత ఖర్చుతో పైపులైన్ ఏర్పాటు చేసిన రూరల్ సీఐ రాకేష్!

విభారె న్యూస్:- నవంబరు 12,నంద్యాల జిల్లా (డోన్). చనుగొండ్లలో గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు చొరవ.. ఇందిరాంపల్లిలో నవగ్రహాల ఆలయ నిర్మాణానికి శ్రీకారం డోన్ మండలం చనుగొండ్ల గ్రామంలో పాడుబడిన బావికి రూరల్ సీఐ రాకేష్ చొరవతో పునర్జీవం లభించింది. గ్రామంలో నీటి సమస్యను గుర్తించిన రూరల్ సీఐ రాకేష్ గ్రామస్తులను చైతన్యపరిచి, వారిలో సేవాభావాన్ని నింపి పాడుబడిన బావిని శుభ్రం చేయించారు. అంతటితో ఆగకుండా, దూర ప్రాంతం నుంచి బావికి నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన పైపులైన్‌ను తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామస్తులకు నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక కృషి చేశారు.





అదేవిధంగా డోన్ మండలంలోని ఇందిరాంపల్లి గ్రామంలో కూడా రూరల్ సీఐ రాకేష్ చొరవతో నవగ్రహాల దేవాలయ నిర్మాణం చేపడుతున్నారు. సామాజిక సేవతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యతనిస్తూ గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారు.

సాధారణంగా పోలీసులంటే శాంతిభద్రతల పరిరక్షణ మాత్రమే గుర్తుకొస్తుంది. కానీ రూరల్ సీఐ రాకేష్ మాత్రం ప్రజల సమస్యలను తనవిగా భావించి, సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయం. తన సొంత ఖర్చులతో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజల భద్రతతో పాటు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్న రూరల్ సీఐ రాకేష్‌ను చనుగొండ్ల, ఇందిరాంపల్లి గ్రామస్తులు అభినందిస్తున్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూనే ప్రజాసేవకు సమయం కేటాయించడం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

మండల ప్రజా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు,

ఉపాధ్యక్షుల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్:-నంద్యాల, నవంబర్ 12: జిల్లాలో పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించనున్న





మండల ప్రజా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు తీసుకోవాలని తెలిపారు. మరియు ఉపాధ్యక్షుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోనీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు మండల ప్రజా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు, ఉపాధ్యక్షుల ఎన్నికల నిర్వహణ పై రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు 2026 నవంబర్ 19వ తేదీన సంబంధిత మండల ప్రజా నేపథ్యంలో, ఎన్నికకు కనీసం ఆరు రోజుల ముందుగా నవంబర్ 14వ తేదీలోపు ఎంపీడీవోలు, ప్రిసైడింగ్ అధికారులు మండల ప్రజా పరిషత్ సభ్యులందరికీ ఫారం-2 ద్వారా ఎన్నికల నోటీసులను అందజేయాలని తెలిపారు. నోటీసులు అందజేసినట్లు సభ్యుల నుంచి రశీదులు తప్పనిసరిగా నామినేషన్ల స్వీకరణ, పరిశీలన

నవంబర్ 19వ తేదీన ఉదయం 10 గంటలలోపు కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి ఫారం-3 ద్వారా నామినేషన్లను స్వీకరించాలి. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు నిర్దేశించిన అర్హతలు కలిగి ఉండటంతో పాటు, ప్రతిపాదకులు, బలపరిచే సభ్యులు కూడా సంబంధిత మండల ప్రజా పరిషత్ ఎన్నుకోబడిన సభ్యులై ఉండాలని తెలిపారు. అభ్యర్థికి 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని, నిబంధనల ప్రకారం మత లేదా భాషా అల్పసంఖ్యాక వర్గానికి చెందిన అర్హతను సంబంధిత ధృవపత్రాలతో నిర్ధారించుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహించి, అనంతరం నిర్ణీత నిబంధనల ప్రకారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.

కోఆప్షన్ సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకారం

అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు సమావేశం నిర్వహించి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించాలని, ప్రమాణ స్వీకార పత్రాలను రెండు ప్రతులుగా సిద్ధం చేసి ఒక ప్రతిని సభ్యునికి, మరొక ప్రతిని ప్రిసైడింగ్ అధికారి వద్ద భద్రపరచాలని సూచించారు. మినిట్స్ పుస్తకంలో కూడా సభ్యుల సంతకాలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నిక ఏకగ్రీవం కాని పక్షంలో నిబంధనల ప్రకారం చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించాలన్నారు.

ఉపాధ్యక్షుని ఎన్నిక:

కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ పూర్తయిన అనంతరం అదే రోజు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికకు సంబంధించి తదుపరి సమావేశం నిర్వహించాలి. సమావేశ సమయాన్ని కార్యాలయ నోటీసు బోర్డుపై ముందుగా ప్రకటించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిర్ణీత సమయపాలన పాటిస్తూ, అన్ని రికార్డులు మరియు ఎన్నికల సంబంధిత పత్రాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఈఓ శివశంకర్, జెడ్పి సీఈవో సుబ్బారెడ్డి, డి ఎల్ డి వో శివారెడ్డి పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ లో రాణించి కీర్తి ప్రతిష్టలు తీసుకురండి

● అనంతలో ముగిసిన మహిళా క్రికెట్ ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండవ దశ కార్యక్రమం ● జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహిళ క్రికెటర్లుహాజరు క్రికెట్ చరిత్రలో రికార్డు ● మచ్చా రామలింగారెడ్డి ● చైర్మన్ ఆర్.డీ.టి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ

విభారె న్యూస్:- అనంతపురం, నవంబరు 12. మహిళా క్రికెట్ లో జిల్లా యువ మహిళా క్రికెటర్లు



రాణించి జాతీయ రాష్ట్రస్థాయిలో పాల్గొని జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అనంతపురం జిల్లా నుంచి అనూష రెడ్డి భారత జట్టుకి ప్రాతినిథ్యం వహించడం జిల్లాకు గర్వకారణం అని ఆర్డిటి ఆధ్వర్యంలో జాతీయ క్రికెటర్ తయారైందని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని మచ్చా రామలింగారెడ్డి గుర్తు చేశారు జిల్లాలో మహిళా క్రికెటర్ల ప్రతిభకు కొరతలేదని గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభ ఉన్న మహిళా క్రికెటర్లకు యువ క్రికెటర్లు ఉన్నారని వారికి సరైన ప్రోత్సాహము గుర్తింపు లేకపోవడం వల్ల వారి ప్రతిభ వెలుగులోకి రావట్లేదు అని అనంతపురం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువ క్రికెటర్లు రాబోవు రోజుల్లో క్రికెట్ లో రాణించి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయికి మహిళా క్రికెటర్లు ఎదిగి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆర్డిటి సంస్థ ఇస్తున్న ప్రోత్సాహాన్ని ప్రతి ఒక్క యువ క్రికెటర్ ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ కార్యక్రమం జరుగుతున్నదని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళా క్రికెట్ టాలెంట్ హంట్ ముగింపు సమావేశంలో మచ్చ రామలింగారెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని 14 కేంద్రాలలో ఆర్డిటి నిర్వహించిన మహిళా క్రికెట్ టాలెంట్ హంట్ రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ లో రెండవ దశలో అండర్ 15, అండర్ 18 సత్యసాయి అనంతపురం జిల్లాకు చెందిన మహిళ క్రికెటర్లు పాల్గొన్నారు వారి ప్రతిభని సెలెక్టర్లు గమనించారని అంతకు ముందు నిర్వహించిన మొదటి విడతలో రెండు వేల మంది పైగా యువ క్రికెటర్లు పాల్గొనడం జిల్లా క్రికెట్ చరిత్రలో ఇది ఒక రికార్డ్ అని భవిష్యత్తులో జిల్లాలో యువ క్రికెటర్లకు కొరత లేదని ఈ కార్యక్రమం నిరూపించిందని రాబోవు రోజుల్లో క్రికెట్ లో రాణించి జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి జాతీయస్థాయి రంజీ క్రీడాకారులు కావాలన్నదే ఆర్డిటి మంచో ఫెర్రర్ లక్ష్యం అని అందుకోసం జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించే కార్యక్రమాన్ని మంచో ఫెర్రర్ గారు నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జిల్లాలోని యువ క్రికెటర్లందరూ ఉపయోగించుకున్నారని ఇది ఒక మంచి శుభ పరిణామం అని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ అన్నారు అనంతపురం నగరంలోని ఆర్డిటి క్రీడా గ్రామంలోని క్రీడా మైదానం నందు ఆర్డిటి ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రతిభాన్వేషణ ఎంపికలను నిర్వహించింది. రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండవ దశ మహిళా క్రికెట్ సెలక్షన్లు అండర్ 15, 18 అనంతపురం సత్యసాయి జిల్లాల మహిళా క్రికెటర్ల కార్యక్రమం ముగిసింది ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, ఆర్డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మచ్చా రామలింగారెడ్డి, సెలెక్టర్లు రాధిక , హరినాథ్ రెడ్డి, వెంకటేష్ ఆర్డిటి గ్రాస్రూట్స్ కోఆర్డినేటర్ కె.ప్రవీణ్, యుగంధర్, విజయ రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డి మహిళా క్రికెటర్ల ను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఆర్డిటి ఈ నూతన చొరవ తీసుకుందని, ప్రతిభాన్వేషణ కోసం అనంతపురం నగరంలోని చుట్టుపక్క ప్రాంతాల్లో ఉన్నటువంటి యువ క్రీడాకారులు సమావేశమవడం ఆనందంగా ఉందని, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి కోచింగ్ శిబిరాలకు పంపుతాము అని తెలిపారు. అనంతపురం నుంచి ప్రతిభ ఉన్న ఎందరో క్రికెటర్లు ఆర్డిటి స్టేడియం ను ఉపయోగించుకొని రంజీ ట్రోఫీ ఆటగాళ్లు కాగలిగారని, టాలెంట్ హంట్ ఎంపికల ద్వారా ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తిస్తున్నామని, గ్రామీణ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు సరైన క్రికెట్ సౌకర్యాలను వినియోగించుకునేలా చూడటానికి మాజీ భారత, ఆంధ్ర ఆటగాళ్లతో కలిసి చీజూ, రాష్ట్ర జట్ల శిబిరాల వంటి శిబిరాలను నిర్వహించాలనుకుంటున్నామని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. గ్రామీణ ప్రతిభను ప్రోత్సహించి, వారికి మరింత శిక్షణ ఇవ్వడమే మంచో ఫెర్రర్ లక్ష్యమని ఆయన తెలిపారు. సమావేశం అనంతరం మచ్చా రామలింగా రెడ్డి అండర్ 15, 18 యువ మహిళా క్రికెటర్లను అనంతపురం జిల్లా యువ క్రికెటర్లను పరిచయం చేసుకొని లాంఛనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఆర్డిటి క్రికెట్ కోచ్ లు హరినాథ్ రెడ్డి, ఇనైతుల్లా, కృష్ణారెడ్డి, రాజశేఖర్, సాల్మన్, భాను తదితరులు పాల్గొన్నారు ఈ ఎంపిక ప్రక్రియలో పెద్ద ఎత్తున మహిళా క్రికెటర్ లు పాల్గొన్నారు.

పెమినేని హెల్ప్ హాండ్స్ ట్రస్ట్ ద్వారా స్పోర్ట్స్, టీ షర్ట్స్,షాట్స్ పంపిణీ

అనంతపురం నవంబర్ :12 విభారె న్యూస్:- పుట్లూరు మండలములో కస్తూర్బా బాలికల పాఠశాలలో స్పోర్ట్స్ టీ షర్ట్స్, షాట్స్ అవసరము అని బిజెపి నాయకులు విషయము తెలియజేయగా ఆమె వారి ట్రస్ట్ ద్వారా 10,000 వేల రూపాయల, స్పోర్ట్స్ టీ షర్ట్స్, షాట్స్ పంపిణీ చేయడము జరిగినది.ఆమె మాట్లాడుతూ మేము మా ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు 7 లక్షల రూపాయల దాకా అవసరమైన చోట వస్తు రూపేణా ,క్యాష్ రూపేణా నా ఇవ్వడము జరిగినది అని తెలియచేయడం జరిగినది. ఆమె పిల్లలతో మాట్లాడుతూ ఆడపిల్లలు అధిపర శక్తి తో సమానము,దేనికి తల వంచకూడదు,వారు పెద్ద అయ్యాక ఏమి కావాలని కోరుకుటున్నారో అడిగి తెలుసుకోవడం జరిగినది.తరువాత పిల్లలకు టీ షర్ట్స్, షాట్స్ పంపిణీ చేయడము జరిగినది. ఈ కార్యక్రమములో కస్తూర్బా బాలికల పాఠశాల స్కూలు ప్రిన్సిపాల్ మాధవి గారు,వారి సహా ఉద్యోగినిలు,బిజెపి నాయకులు రామ్మోహన్,శింగనమల ఇ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసుల రెడ్డి,ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య,లొమాడ రాము,మధు,నరసింహ రెడ్డి,రామనాథ రెడ్డి పాల్గొనడం జరిగినది.



మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను

మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎంపీపీ షేక్ సహిద





విభారె న్యూస్:-నంద్యాల జిల్లా, నవంబర్ 12: బండిఆత్మకూరు మండలం, జి.లింగాపురం ఎంపీటీసీగా భారీ మెజారిటీతో గెలుపొంది, శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ బుడ్డా రాజశేఖర్ రెడ్డి గారి ఆశీస్సులతో నూతన ఎంపీపీ గా ఎన్నికైన షేక్ సహిద నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో నూతన ఎంపీపీ షేక్ సహిద గారు మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారికి పుష్పగుచ్ఛం అందించి, గజమాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపీపీ బాధ్యతలు చేపట్టనున్న షేక్ సహిద గారిని మంత్రి ఫరూక్ అభినందించి, మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జి. లింగాపురం మాజీ సర్పంచ్ షేక్ బాబు, నాయకులు షేక్ ఫైజుల్ల, బాషా, రెహమాన్, సద్దాం మరియు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఇసాక్ బాషా



నంద్యాల విభారె న్యూస్:- : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా కలిశారు. నంద్యాల మున్సిపాలిటీలో 27 వార్డులతో పాటు నంద్యాల, గోస్పాడు జెడ్పీటీసీ స్థానాలు, 20 ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ సాధించిన విజయంపై వైఎస్ జగన్ హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ ఇసాక్ బాషాను అభినందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని జైలు వద్ద కలిసి ఇసాక్ బాషా సంఘీభావం తెలిపారు. పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

మున్సిపల్, ఎంపీటీసీ ఎన్నికల్లో జరిగిన రిగ్గింగ్‌పై హైకోర్టు జోక్యం చేసుకోవాలి

-పోలింగ్ బూత్‌ల సీసీటీవీ ఫుటేజ్‌ను బహిరంగపరచాలి: వాణూ× జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ హుస్సేన్

విభారె న్యూస్:- నవంబరు 12, నంద్యాల ఇటీవల జరిగిన మున్సిపల్, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు అవకాశం లేకుండా అధికార కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని, ఎన్నికల కమిషన్‌ను, రౌడీ మూకలను ఉపయోగించుకుని అక్రమాలకు, రిగ్గింగ్‌కు పాల్పడి విజయం సాధించిందని వాణూ× జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ హుస్సేన్ గారు ఆరోపించారు. ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ ఎన్నికల కమిషన్ వద్ద 60 రోజుల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొంటూ, ప్రతి పోలింగ్ బూత్‌కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను వెంటనే ప్రజలకు బహిరంగంగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తే ఏయే పోలింగ్ బూత్‌లలో అక్రమాలు, రిగ్గింగ్ జరిగాయో ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. ఈ మొత్తం ఎన్నికల వ్యవహారంపై గౌరవ హైకోర్టు జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని, ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడాలని వాణూ× తరఫున డిమాండ్ చేశారు.



ఏళ్ల తరబడి ఎదురుచూపులు... గెలిచిన వారం రోజుల్లోనే పరిష్కారం!



విభారె న్యూస్:-నవంబరు 12, నంద్యాల జిల్లా. 46వ వార్డు కౌన్సిలర్ షేక్ అక్బర్ భాష అండ్ టీమ్ అదుర్స్! నంద్యాల పట్టణంలోని 46వ వార్డు ప్రజలను సంవత్సరాల తరబడి వేధిస్తున్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ప్రజల సమస్యను గుర్తించిన 46వ వార్డు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ షేక్ అక్బర్ భాష గారు, ఎన్నికల్లో విజయం సాధించిన వారం రోజులు కూడా గడవకముందే పనులను ప్రారంభించి పూర్తి చేయించడం విశేషం. మాటలతో కాదు... చేతలతో సమాధానం చెప్పే నాయకత్వం! ప్రజలు నమ్మకంతో అప్పగించిన బాధ్యతను గుర్తించి, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న షేక్ అక్బర్ భాష గారు మరియు వారి టీమ్‌కు 46వ వార్డు ప్రజల తరఫున అభినందనలు. గెలుపు ఒక బాధ్యత... అభివృద్ధి ఒక నిరంతర ప్రయాణం!

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPPTAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL-518001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR: AVULA VIJAYA BHASKARA REDDY. RNI No: APTEL/2019/77190